కథ

# అప-సవ్యం

## ఎం.ఎల్. పురుషోత్తం

కరవుప్రాంతమైన రాయలసీమలోని అనంతపురం జిల్లాలో ఒక మూలగా అనంతపురం నుండి బెంగుళూరు వెళ్ళే రోడ్డుమీదున్న ఓ రైల్వేగేటు పేరు నాగసముద్రం గేట్. అయితే వ్యావహారికంలో అది 'ఎన్నెస్ గేట్'గా మారిపోయింది.

ఎన్నెస్ గేట్ గుండా వెళ్ళే రోడ్డుకు అతికించినట్లుగా ఆ గేట్‌కు అటువైపొకటి, ఇటువైపొకటీ, రెండు చిన్న రోడ్లున్నాయి. ఇవతలి రోడ్డు - రాయలసీమలో తిండి కరువైనా ఆధ్యాత్మిక చింతనకేమీ లోటు లేదనిపిస్తూ పుట్టపర్తికి పరుగెత్తితే, అవతలిరోడ్డు- రాయలసీమ వట్టి రాళ్ళసీమే కాదు, రత్నాల సీమ కూడా అని గుర్తు చేసే బంగారపు గనులున్న రామగిరికి దారి తీస్తుంది. ఈ రోడ్లన్నింటికీ కూడలిగా ఉన్నందుకే ఎన్నెస్ గేట్ ఎప్పుడూ వచ్చే పోయే వాహనాలతోను, ప్రయాణీకులతోను హడావిడిగా, నిండుగా కళకళలాడుతూ ఉంటుంది.

తెల్లవారటాని కింకా సమయం ఉన్నా, రాత్రంతా కలతనిద్రతో సతమతమైన నాగరత్న ఇక ఆగలేనట్టుగా లేచి, దీపం వెలిగించి, పిల్లలకు దుప్పటి సరిగా కప్పి ఇవతలకు వచ్చింది. పొయ్యి ముట్టించి, దాని మీద పాత్రలో నీళ్ళు పెట్టి పొయ్యిముందే కూర్చుని, సాలోచనగా గతాన్ని నెమరువేసుకోసాగింది నాగరత్న.

పేద ఇంట్లో పుట్టినా, టవున్లో ఉండడం వల్ల నాగరత్నకు అయిదో తరగతి వరకూ చదువు అబ్బింది. పధ్నాలుగేళ్ళకే తనను తల్లిదండ్రులు తమ దూరపు బంధువైన నారాయణకిచ్చి పెళ్ళి చేశారు. అప్పట్లో నారాయణ లారీ క్లీనర్‌గా పని చేసేవాడు. పెళ్ళయిన రెండేళ్ళకే ఇద్దరు బాబులు పుట్టారు. గత పన్నెండేళ్ళలో ఎన్నో మార్పులు జరిగాయి. తండ్రి చనిపోయాక తల్లి అనంతపురంలోనే పెద్దన్నయ్య దగ్గరే ఉంది. పెళ్ళయిన అయిదేళ్ళ వరకు తానూ అక్కడే వున్నా, ఆ తర్వాత నారాయణకు ధర్మవరంలోని ఒక లారీ కంపెనీలో డ్రైవర్‌గా పని దొరకటంతో కాపురం ధర్మవరానికి మారింది. అయితే అక్కడ ధరలు, అద్దెలు మండిపోతూండటంతో, రెండేళ్ళ తర్వాత ఎన్నెస్ గేట్‌కు మకాం మార్చారు. నారాయణ నడిపే లారీ ఎప్పుడూ ధర్మవరం- బెంగుళూరుల మధ్యే తిరుగుతూ ఉండడం వల్ల, ఎన్నెస్ గేట్‌లో కాపురం పెట్టటం అనుకూలించింది.

సహజంగా చురుకైనదీ, కాస్తో కూస్తో చదువున్నదీ అయిన నాగరత్న ఎన్నెస్ గేట్‌కు మకాం మార్చిన మూడు నెలలకే చవకగా అమ్మకానికి వచ్చిన ఒక పాత బంకు (బడ్డీకొట్టు)ను తన ఏకైక ఆస్తి, తల్లిదండ్రుల జ్ఞాపికా అయిన తన 'ఒక తులం' బంగారుగొలుసును కుదువ పెట్టి కొనుక్కొంది. పూలు, పండ్లుతో ప్రారంభించిన వ్యాపారం సంవత్సరం తిరిగేలోగా బీడీలు, సిగరెట్లు, తమలపాకుల, వక్కలుతో బాటు చాక్లెట్లు, బిస్కెట్లు కూడా అమ్మటం మొదలైంది. నాగరత్న వ్యాపారం ప్రారంభించిన తర్వాత నారాయణ ఇంటి ఖర్చులివ్వటం మొదట్లో తగ్గించి, ఆ తర్వాత క్రమక్రమంగా మానేశాడు. తన సంపాదనంతా వినోదాలకు, జల్సాలకు తగలెయ్యటం ప్రారంభించాడు. ఇంటి ఖర్చులకు మూడొందలన్నా నారాయణ దగ్గర వసూలు చెయ్యడానికి ఎంతో గొడవ చెయ్యాల్సి వచ్చేది. ఇంటి వ్యవహారాల్లో నాగరత్నకు పూర్తి స్వాతంత్ర్య ఉన్నా పిల్లల్ని బడికి పంపడం మాత్రం నారాయణకు బొత్తిగా ఇష్టం ఉండేది కాదు. 'లారీలో పెడితే పనికి పనీ నేర్చుకుంటారు, అంతో ఇంతో ఇంటికి పట్టుకొస్తారు కదా?'' అనేవాడు. "నా మొగుడెట్లా నల్లబట్టల్తో ఊరేగుతాండడు గదా, నా కొడుకులన్నా తెల్లబట్ట లేసుకుని బతకనీ! వాళ్ళంతకు వాళ్ళు సదూకుంటాంటే నీకు యాలప్పా నొప్పి?'' అని పరుషంగా గదిమేది.

తననేమీ తొందర చెయ్యకుండా బంకుమీది ఆదాయంతో సంసారాన్ని నడిపించుకుంటోన్న తన చదువుకున్న భార్య అంటే నారాయణకూ అభిమానమే! అందుకని పిల్లల చదువు విషయంలో ఇంకేమీ అభ్యంతరం చెప్పలేకపోయాడు. అలా కొడుకులిద్దరినీ పట్టుదలగా చదివించుకొస్తోంది నాగరత్న. పెద్దోడు అయిదో క్లాసు, చిన్నోడు మూడోక్లాసు చదువుతున్నారు. ఎన్నెస్ గేట్లో బడి లేకపోయినా, అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న 'సీకేపల్లి' అనబడే చెన్నే కొత్తపల్లికి బస్‌లో వెళ్ళి చదువుకుని వస్తూంటారు పిల్లలు.

అలా నెమ్మదిగా యధాలాపంగా సాగుతోన్న నాగరత్నకు రాత్రి నిద్ర పట్టనీయకుండా చేసిన సంఘటన ఆ ముందురోజే జరిగింది..

*　　　*　　　*

ఎప్పటిలాగా ఆ రోజు కూడా బంకులో కూర్చుని, అప్పుడే ధర్మవరం బస్సులో వచ్చిన మల్లెమొగ్గల్ని మాలగా కడుతోంది నాగరత్న. సాయంకాలం నాలుగు కావస్తోంది. తన బంకు కెదురుగా రోడ్డవతల వున్న టీ బంకు దగ్గరకొక తెల్ల మారుతీకారు వచ్చి ఆగింది. దానిలోంచి సూట్ వేసుకున్న నలభైఏళ్ళ తనూ, ముప్పయి అయిదేళ్ళ ఆవిడా దిగి, టీ త్రాగి వెళ్ళిపోబోయారు. అతడు కారెక్కి కూర్చున్నాడు. ఆమె కారెక్కబోతూ ఎందుకో తనవైపు చూసి ఆగి, కారెక్కకుండానే అతనితో ఏదో చెప్పి, గబగబా రోడ్డు దాటి తనవైపు రాసాగింది. ఎత్తైన విగ్రహం, తెల్లని మేని ఛాయతో, నల్లని పొడవైన జడతో, కుంకుమరంగు జరీఅంచు ఉన్న చిలకాకుపచ్చ పట్టుచీరలో, ఆమె ఎవరో సినిమా నటిలాగా ఉంది. ఒక చేతికి బంగారు రంగువాచీ, మరో చేతికి బంగారురంగు గొలుసుకు వ్రేల్లాడుతున్న పాలనురుగులాంటి తెల్లని అందమైన పర్సును తగిలించుకుంది. ఆవిడింకా అయిదడుగుల దూరంలో ఉండగానే సెంటు వాసన గుబాళించింది.

దగ్గరికి రాగానే ఆమె తన పర్సును ప్రక్కన పెట్టి, మల్లెమాలను చేతిలోకి తీసికొని, "ఇదెంత?'' అని అడిగింది. దాదాపు రెండు మూరలకు పైగా ఉన్న ఆ సరానికి ఎంతవుతుందో ఒక్కక్షణం ఆలోచించి, "అయిదురూపాయ'లని జవాబిచ్చింది నాగరత్న. అందుకామె మాట్లాడకుండా, ప్రక్కనున్న పర్సు తెరిచి అయిదు రూపాయల నోటు తీసిచ్చి, పర్సును మూసేసింది. మల్లెల సరాన్ని పొట్లంలో నాగరత్న కట్టిద్దామనుకునేంతలో ఆమె ఆ మాలని తన చేత్తో తీసుకుని, వెనక్కి తిరిగి వడివడిగా నడుస్తూనే దానిని తలలో ముడుచుకుంటూ రోడ్డు దాటి కారెక్కింది. ఆమె ఇంకా కారు తలుపు వేసుకుంటూండగానే కారు జుయ్యిమని జారినట్టుగా రోడ్డుమీద పరిగెత్తింది.

ఆమె వెళ్ళిపోయి అయిదు నిమిషాలైనా, ఆమె తాలూకు సెంటువాసన పరిమళిస్తూనే ఉంది. తల తిప్పి రోడ్డుమీదికి చూచిన నాగరత్న అక్కడున్న వాళ్ళంతా, ఆడామగా అందరూ ఆ తెల్లకారు వెళ్ళిన వైపే చూస్తూండడం గమనించింది. ఆమె తన బంకుకు వచ్చి పువ్వులు కొనుక్కెళ్ళడం గొప్పగా అనిపించింది నాగరత్నకు. 'ఆమె ఎవరన్నా సినిమా నటి అయ్యుండొచ్చు. లేదా, బాగా డబ్బున్నవాళ్ళయి ఉండాలి. ఉన్నవాళ్ళందరూ అందంగా ఉంటారెందుకో? అందంగా ఉన్నవాళ్ళకే అన్నీ అబ్బుతాయేమో!' తనలోనే తర్కించుకుంటూ నాగరత్న పువ్వులు కట్టడం కొనసాగించింది.

"అమ్మోవ్! ఒక కట్ట ముప్పై నంబరు బీడీలియ్యి!'' అనే కేకతో ఉలిక్కిపడింది నాగరత్న. బీడీకట్ట ఇచ్చి డబ్బు తీసుకొని, చిల్లరిచ్చి మళ్ళీ పువ్వులు కట్టే ప్రయత్నంలో దారపు ఉండ కోసం చూస్తే అది కనిపించలేదు. చాక్లెట్ సీసాల మధ్య పడిందేమోనని వాటిని జరపబోయిన నాగరత్న అదిరిపడింది. అక్కడ.. ఆ సీసాల మీద.. బంగారురంగు గొలుసుతో ఉన్న పాలనురగ లాంటి తెల్ల పర్సు.. అందంగా, ఠీవిగా నిలబడి ఉంది. నాగరత్న గుండె కొట్టుకోవడం ఒక క్షణం ఆగిపోయి, ఒక క్షణం తర్వాత మళ్ళీ కొట్టుకోవడం మొదలెట్టింది. మామూలుగా కాదు.. ఉదయాన్నే ఆ దారిన వెళ్ళే 'ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్' లాగా దడదడా కొట్టుకోసాగింది. 'ఓర్నాయనో! ఎంత పనైంది? ఆమె దీన్నిక్కడే పెట్టి వెళ్ళిపోయిందా?' ఒక్క ఉదుటన ఆ పర్సును తన చేతుల్లోకి తీసుకుని ఎవరికీ కనిపించకుండా బంకులోపలికి లాక్కుంది. ఆ పర్సు నిజంగానే పాలనురగలా, ఎంతో మృదువుగా ఉంది, పరిమళాన్ని ఘుమఘుమా గుబాళిస్తూనే ఉంది. 'దీన్ని మళ్ళీ ఆమెకు అందించాలి! కానీ ఎలా!'' ఆరాటపడింది నాగరత్న. ఆమె మళ్ళీ తిరిగి రావాలని మనసారా కోరుకుంది. ఆమె వస్తే మళ్ళీ మళ్ళీ ఆమెను చూడొచ్చు, అంతేగాక ఆమె పర్సును భద్రంగా ఆమె కప్పగించవచ్చు' అనుకొంటూ ఆలోచనలో పడింది నాగరత్న.

'ఇంతకూ దీనిలో ఏముంది?' తీసి చూడాల నిపించింది నాగరత్నకు. కానీ... అంతలోనే సంకోచం,

మరొకరి పర్సును తీసి చూడొచ్చా? ఊరికే తీసి చూస్తే ఏం? అందులోనిదేదైనా తీసుకోవడం తప్పు గానీ. అలా ఆలోచిస్తూ, మనసు గట్టిపరచుకొని, పర్సుకు పై వైపున పెనవేసుకుని ఉన్న మీటలను విడదీసింది. పర్సు తెరవగానే సెంటు పరిమళం బలంగా సోకి నాగరత్నను ఉక్కిరిబిక్కిరి చేసింది. పర్సులో పుస్తకం లాంటిదేదో ఉంది. సరిగా గమనిస్తే అది వందరూపాయల కట్ట. నాగరత్న నివ్వెరపోయింది. దాంతోటే మరికొన్ని నోట్లు విడిగా వున్నాయి. అవీ వందరూపాయల నోట్లలాగే ఉన్నాయిగానీ వాటిమీద గాంధీతాత బొమ్మ ఉంది. ఒకటి బయటికి తీసి పరికించి చూస్తే అది ఐదువందల నోటని బోధపడింది. అలాంటివి నాగరత్న ఇదివరకెప్పుడూ చూసి ఉండలేదు.. 'ఓహ్! అయిదువందల నోటు ఇలా ఉంటుందన్నమాట!' అని ఎంతో అబ్బురపడింది. ఆ పర్సులో ఇంకా యాభై, పది, అయిదు, రెండురూపాయల నోట్లు కూడా ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా అంత పరిమళానికి ఆయువుపట్టయిన సెంటుసీసా విలక్షణమైన ఆకృతిలో ఆకర్షణీయంగా, చూడముచ్చటగా ఉంది. ఇంకా దువ్వెన, తలపిన్నులు, చిల్లర నాణాలూ లాంటివెన్నో ఉన్నాయి. వాటన్నింటినీ జాగ్రత్తగా లోపల ఉంచి, పర్సును మూసి, లోపల దాచేసింది నాగరత్న.

ఆ పర్సులో పది, పన్నెండు వేలపైగా డబ్బుంది. తానెప్పుడూ అంత డబ్బును తన దగ్గరుంచుకోలేదు. అంత డబ్బున్న పర్సును ఆవిడెలా మర్చిపోయిందో! అది పోయినందుకామె భర్త ఏమన్నాడో? ఎంత డబ్బున్న వాళ్ళకైనా పదివేలు పోగొట్టుకోవటమంటే మాటలా? చిన్నప్పుడొకసారి తానో పదిరూపాయల నోటును పారేసుకున్నందుకు తన్నులు తినటం గుర్తొచ్చింది నాగరత్నకు.

* * *

**పొ**య్యి మీద నీళ్ళు మరిగి, సలసలా శబ్దం చేయడంతో నాగరత్న స్పృహ తెచ్చుకొని గబగబా పొయ్యిలోని కొరవుల్ని బయటికి లాగింది.

చీకటితో మొదలు పెట్టిన వంట ఆరున్నరకే అయిపోయింది. ఏడింటికే తమ 'టిఫిన్లు' సిద్ధమవటం చూసిన పిల్లలు బిత్తరపోయారు. గబగబా స్నానాలు చేసి భోజనం చేసి ఎనిమిదికే బట్టలేసుకుని బడికి సిద్ధపడ్డా, బస్సు వచ్చేది తొమ్మిదికి కనుక, ఇంట్లో ఉంటే అంతవరకూ చదువుకోవాల్సొస్తుందని మెల్లగా బయటకు జారుకుని ఆడుకోవడం మొదలుపెట్టారు. పర్సు ధ్యాసలో ఉన్న నాగరత్న వారిని పట్టించుకోలేదు. లేకపోతే, వాళ్ళను కట్టడి చేసి, తొమ్మిదింటికి బస్సు వచ్చేదాకా కూచోబెట్టి చదివించేదే! అయితే ఇవ్వాళ్టి పరిస్థితి వేరు. ఇవ్వాళ నాగరత్నకు మనసు మనసులో లేదు. ఆ తెల్లని పాలనురగలాంటి పర్సూ, అందులోని నోట్లూ కనిపిస్తున్నాయి. ఆవిడ తిరిగి వస్తే పర్సును అప్పగించాలని నిర్ణయం చేసికొని, దాన్ని భద్రపరచి ఉంచినా కూడా, నాగరత్న మనసులోని అట్టడుగుపొరల్లో ఏదో అలజడి చెలరేగుతోంది.

మామూలుగా తొమ్మిది గంటలకి పిల్లల్ని బస్సెక్కించి బంకు తెరిచే నాగరత్న ఈ రోజు ఎనిమిదింటికే బంకు తీసి, మొట్టమొదట పర్సు భద్రంగా ఉందా అని చూసి మరోసారి గాంధీతాత దర్శనం చేసుకుని, మళ్ళీ ఆలోచనలో పడిపోయింది.

తాను పేద ఇంట్లో పుట్టటం వల్లయితేనేమి, తన తండ్రి త్రాగుడు వల్లయితేనేమి చిన్నప్పటి నుంచి పేదరికాన్నే అనుభవించింది నాగరత్న. తన పెళ్ళికి తన మేనమామ పెట్టిన ఒక తులం బరువుండే బంగారు గొలుసు వేసికొనే వరకూ తానసలు బంగారు నగలే వేసికోలేదు. ఇప్పుడు అనుకోకుండా ఇంత డబ్బు చూసేసరికి నాగరత్న మనసు చెదురుతోంది. ఇంత డబ్బు సంపాదించాలంటే తనకెన్నేళ్ళు పడుతుందో! బంకు కొనటానికని కుదువ పెట్టిన గొలుసు తాలూకు వడ్డీ కట్టడమే అవుతోంది గానీ, అసలింకా సగానికి



పైగానే కట్టాల్సి ఉంది. అది విడిపించుకోటానికింకా మూడేళ్ళు పడుతుందనుకుంది నాగరత్న.

అయిదో తరగతి చదువుతున్న పెద్దోడు, తన క్లాసు పిల్లల్ని విహారయాత్రకని లేపాక్షికి తీసుకెళ్తారనీ, అందుకు గాను యాభైరూపాయలు కట్టాలని నెలనుంచీ అడుగుతున్నాడు. వాడికా డబ్బిస్తానని మాట ఇచ్చినా వాడి కోసమై తాను నిలవ చేసింది పాతిక రూపాయలలోపే! నారాయణ చూస్తే ఇంటికి డబ్బివ్వడం పూర్తిగా మానేశాడు. సంసార భారాన్ని తలకెత్తుకున్నందుకు అన్ని కష్టాలూ తనే అనుభవించ వలసి వచ్చింది. నాగరత్నకు ఏడుపు ముంచుకొచ్చింది.

పోనీ, తెల్లపర్సులో నుండీ పెద్దోడి కోసం ఓ యాభైరూపాయల నోటును తీసుకుంటే? అమ్మో! అది దొంగతనం కాదూ? ఆమె వచ్చి డబ్బు లెక్కచూసుకుని, తన డబ్బు పోయిందని గొడవ చేస్తే? అమ్మో! ఎంతవమానం? ఇన్నాళ్ళూ పరువుగా బ్రతికిన బ్రతుకంతా దుమ్ము కొట్టుకుని పోదూ! పోనీ, ఆమె ఈసారి వచ్చినపుడు తానసలా పర్సే చూడలేదని చెబితే? అప్పుడా డబ్బుతో కావలసినవన్నీ కొనుక్కోవచ్చు. తానిప్పుడున్న స్థలాన్ని కొనేసి, ప్రక్కనే ఓ గది కూడా వేసుకోవచ్చు.. ఛీ! ఛీ! ఏంటీ, ఆలోచనలు? తనకేమయ్యింది? తన మానసికాందోళన తనను విచక్షణ కోల్పోయేలా చేస్తోన్నట్లుంది. తనెంత దిగజారుతోంది?

ఆలోచనల్లోంచి తేరుకున్న నాగరత్న, తాను నిజంగానే ఏడుస్తోందని గ్రహించి, చీర చెంగుతో మొహం తుడుచుకొని తలెత్తగానే తన సంఘర్షణని అంతం చేసేటందుకా అన్నట్టుగా ఆ తెల్ల మారుతీ కారు తన బంకుముందే ఆగింది, ఆ అందమైన ఆవిడ కారులోంచి దిగి తన బంకువైపు అడుగు వేసింది. ఆ క్షణంలో నాగరత్న మనసులో ఆవిడ వచ్చినందుకు సంతోషమూ, పర్సును డబ్బుతో సహా ఇచ్చి వేస్తున్నందుకు ఒకింత నిరుత్సాహమూ కలగలుపుగా కలిగాయి. వ్యక్తం చెయ్యలేని మిశ్రిత భావాలెన్నో ఆమెలో ఉద్భవించాయి.

ఆమె బంకు దగ్గరకు వచ్చి నుంచుని కొంత తటపటాయిస్తున్నట్లు "నిన్న.. నేనిక్కడ.." అని అంటూండగానే నాగరత్న ఆ పర్సునావిడకి అందించింది ప్రశాంత వదనంతో. ఆ పర్సును చూడగానే ఆమె మొహం విప్పారింది. ఆత్రంగా దాన్నందుకుని తెరచి చూసింది. మళ్ళీ గుప్పున గుభాళింపు. పర్సులో అన్నీ సరిగానే ఉండటం గ్రహించి, ఆమె నాగరత్న ముఖంలోకి ఆశ్చర్యంగా చూస్తూ స్నేహ పూర్వకంగా నవ్వింది. ఏమని మాట్లాడాలో తోచనట్టుగా ఆమె ఒక క్షణం ఆగి, "అమ్మయ్య! ఇదిక్కడుందా? ఎక్కడ పోయిందోనని కంగారు పడ్డా"నంది, వణుకుతున్న స్వరంతో. తన వైపాక అందమైన చిరునవ్వు విసిరి, వెళ్ళిపోయి కారెక్కి, కూచుని అతనితో నవ్వుతూ ఏదో మాట్లాడింది. అతడు కార్లోనుంచి మెచ్చుకోలుగా చూశాడో క్షణం. కారు స్టార్టయి వెనక్కి మలుపు తిరగసాగింది.

అంతవరకు మానసికోద్వేగాన్ని అణచుకున్న నాగరత్న ఇక చేతకాదన్నట్టు మౌనంగా కన్నీరు కార్చింది. అది దుఃఖమూ కాదు, సంతోషమూ కాదు. మానసికోద్వేగ వెల్లువ మాత్రమే! చీరచెంగుతో మొహం తుడుచుకుంటున్న నాగరత్నకు మళ్ళీ ఆ సెంటు పరిమళం సోకినట్లయి, తలెత్తి చూస్తే, ఆ అందమైన ఆవిడ మళ్ళీ ప్రత్యక్షమైంది. ఈసారి ఆమె చేతిలో పర్సు లేదు. "చూడమ్మా నువ్వు నాకెంతో మేలు చేసావు. అందుకు కృతజ్ఞతగా .. ఇదుంచుకో!" అని గబగబా పలికి నాగరత్న చేతిని తీసికొని దానిలో మడత పెట్టిన ఒక నోటునుంచి, జవాబు కోసం ఎదురుచూడకుండా వడిగా వెళ్ళి కారెక్కటమూ, కారు రయ్యిమని రోడ్డు మీద పరుగు తీయటమూ ఒకేసారి జరిగాయి. అనుకోని ఈ పరిణామానికి ఆశ్చర్యపోయింది నాగరత్న. ఆగకుండా వస్తోన్న కన్నీటి తెరల గుండా తన చేతిలోని నోటును విప్పిచూసిన నాగరత్నకు దానిలో గాంధీతాత కనిపించాడు! ■